శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## నేడు లింగసముద్రంలో జగనన్నకు చెబుదాం - అర్జీలు స్వీకరించనున్న జిల్లా కలెక్టర్

**నెల్లూరు అర్బన్, అక్టోబరు 3, ప్రభాతవార్త** ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం మండల స్థాయిలో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం( స్పందన) కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 10గంటలకు లింగసముద్రం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా, మండలస్థాయి అధికారులు హాజరయ్యే ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని గ్రామాల ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేయాలని ఆయన కోరారు. లింగ సముద్రం మండలంలోని ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఈకార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## 7న జిల్లాకు రానున్న జనసేన నేత నాగబాబు



**నెల్లూరు,అక్టోబరు3 ప్రభాతవార్త-విద్య** ఈనెల ఏడు న జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు నెల్లూరు నగరానికి విచ్చేయనున్నారు. రెండురోజులపాటూ ఉమ్మడి నెల్లూరుజిల్లాలోని నియోజకవర్గాల వారీగా పార్టీ నాయకులు, చిరంజీవి యువత సభ్యులు, మెగా అభిమానులతో సమీక్షలు నిర్వహించనున్నారు. నగరంలోని స్థానిక కేవీఆర్ సెంటర్‌లోని రవీంద్రనాథ్‌రాగూర్ హాల్‌లో 7వ తేదీ న ఉదయం 10 గంటలనుండి సర్వేపల్లి, కోవూరు, గూడూరు,వెంకటగిరి,సూళ్లూరుపేట, కావలి,నియోజవర్గాల్లోని నాయకులతో విడతల వారీగా సమావేశాలు నిర్వహింస్తారు. 8న నెల్లూరు నగరం, నెల్లూరురూరల్, నియోజకవర్గాలతోపాటూ ఆత్మకూరు, ఉదయగిరి, నియోజకవర్గాల్లోని నాయకులతో సమావేశాలు నిర్వహించి పార్టీ బలోపేతానికి చేయ్యాల్సిన కృషి తదితర అంశాలపై శ్రేణులకు దిశానిర్ధేశం చేయనునట్లు సమాచారం అయితే అంతర్గతంగా తెలుగుదేశం, జనసేన ల పొత్తులపై పార్టీ తీసుకోవాల్సిన సీట్లు, తదితర అంశాలపై కూడా ఉమ్మడి కార్యాచరణకొరకై ఆయా పార్టీల నాయకులతో కూడా సమావేశాలు నిర్వహించనున్నారని తెలుస్తుంది. కాగా పార్టీలో అంతర్గతంగా ఉన్న విభేదాలు, మెగా అభిమానులను కలుపుకుపోవటం లేదనే అభియోగాలు నాగబాబు పర్యటనతో సమసి పోనున్నట్లు తెలుస్తుంది.అయితే గత ఎన్నికల్లో నెల్లూరు నగరం నుండి జనసేన పార్టీ తరపున పోటీ చేసిన ఓ యువనాయకుడు ప్రస్తుతం పార్టీ మారుతునట్టు వస్తున్న వాదనలతో సమావేశాల్లో రసాబాస ఏర్పడకూడదు అనుకున్న పార్టీ నాయకత్వం నాగబాబు సమీక్షలకు హాజరైయ్యే అభిమాన సంఘ నాయకులు ఆ యువనేత గురించి ఎటువంటి మాటలు ప్రస్తావించకూడదని ముందస్తుగానే హుకుం జారీ చేసి మరీ సమావేశాలకు ఆహ్వానం పంపుతున్నారు.

## సీఎం జగన్‌ను కలిసిన ఎంపీలు ఆదాల, వేమిరెడ్డి



**నెల్లూరు సిటీ, అక్టోబరు 3, ప్రభాతవార్త** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో నెల్లూరు పార్లమెంటు సభ్యులు, రూరల్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యభ సభ్యులు నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నగరమేయర్ స్రవంతి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, వైసీపీ సీనియర్ నేత సన్నపురెడ్డి పెంచల్‌రెడ్డి, జయవర్ధన్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం అభివృద్ధిపై చర్చించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక నిధులను మంజూరు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కోరారు. రూరల్ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎంపీలు ఆదాల, వేమిరెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## 10న స్థాయి సంఘ సమావేశాలు

**నెల్లూరు అర్బన్, అక్టోబరు 3, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా ప్రజాపరిషత్ ఏడు స్థాయి సంఘ సమావేశాలు ఈనెల 10వ తేదీన ఉదయం 10.30గంటలకు నూతన జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరం నందు జరుగుతుందని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి బి.చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు.

## సమిష్టి కృషితోనే బాల్య వివాహాలు అరికట్టవచ్చు



**నెల్లూరు టౌన్, అక్టోబరు 3, ప్రభాతవార్త** మంగళవారం చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ డైరక్టర్ ఐ.శ్రీనివాసరావు, సీజెడబ్ల్యూఎస్‌టీమ్ బాల్య వివాహాల నిషేధానికి మెమొరాండంను మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరక్టర్ బి.హేన సుజనకి అందజేశారు. ఈ సందర్భంగా మహిళ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరక్టర్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్నాయని, కొన్ని బాల్య వివాహాలు చైల్డ్ లైన్ 1098 పరిధిలోకి వస్తున్నాయని, మిగిలిన కేసెస్ తమ దృష్టికి రావడం లేదని పేర్కొన్నారు. మనందరం కలిసి పనిచేస్తేనే బాల్య వివాహాలు నిషేధించవచ్చని ఆమె స్పష్టం చేశారు. చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ డైరక్టర్ ఐ.శ్రీనివాసరావు మాట్లాడుతూ గవర్నమెంట్ అధికారుల సహకారం ఉంటే బాల్య వివాహాల పట్ల తమ వంతు కృషి చేస్తామని అన్నారు. డీసీపీఓ సురేష్ మాట్లాడుతూ స్కూల్స్, జూనియర్ కాలేజీలలో బాల్య వివాహాలు పట్ల అవగాహన కల్పించినట్లయితే కొంత వరకు అరికట్టవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ సీహెచ్ మన్నెమ్మ, షేక్ మనోజ్ ఎం.నాగమణి, వై.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## దేశ ప్రధానికి మణిపూర్‌కు వెళ్లే తీరికలేకపోవడం అత్యంత విచారకరం

**కావలి, అక్టోబరు 3 ప్రభాతవార్త** ప్రపంచాన్ని మొత్తం చుట్టివస్తూ, ఎన్నికల దృష్టితో దక్షిణాది రాష్ట్రాల పర్యటనలు చేస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీకి మణిపూర్‌కు వెళ్లే తీరిక లేకపోవడం విచారకరమని కావలి ఉమెన్ ఫోర్స్ నేతలు తెలిపారు. మంగళవారం కావలి ఉమెన్ ఫోర్స్ కన్వీనర్ సి.శారద, అధ్యక్షురాలు యస్.ప్రభావతి, ఉపాధ్యక్షురాలు టి.సుజాత, నూర్జహాన్, ఫాతిమా, విద్యావతిలు మాట్లాడారు. మే నెల 3వ తేది మణిపూర్ రాష్ట్రంలో తీవ్రమైన అకృత్యాలు బయటపడ్డాయని తెలిపారు. గృహ దహనాలు, హింస, మహిళల నగ్న ప్రదర్శన, గ్యాంగ్ రేప్‌లు, హత్యాపర్వాలతో దేశం తలదించుకునేలా జరిగి ఐదు నెలలైనా మోడీ ఆ రాష్ట్రానికి వెళ్లి బాధితులను పరామర్శించి భరోసా కల్పించకపోవడం చూస్తుంటే ఆయనకు మహిళలపై వున్న నిర్లక్ష్యానికి, చులకన భావానికి అద్దంపడుతుందన్నారు.ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి కేంద్రం పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు.

దురాగతాలు బయటకు రాకుండేందుకు ఆపేసిన ఇంటర్నెట్ సౌకర్యాన్ని పునరుద్దరణ చేసినట్లుగా చేసి 48 గంటల్లో మరలా ఆపేసిన ఘనత మణిపూర్ ముఖ్యమంత్రి బీరేందర్‌కు, ఆయనకు మద్దతిస్తున్న ప్రధానికి దక్కుతుందన్నారు. ఇంకా అక్కడ రావణకాష్టం మండుతూనే వుందన్నారు. కుకీలపై మైదాన ప్రాంత మెయితీల అణిచివేత కొనసాగుతూనే వుందన్నారు. పార్లమెంట్‌లో ఇంతటి దుర్ఘటనలపై ప్రధాని నోరు విప్పలేదని తెలిపారు. విపక్షాలు ఎంత వత్తిడి చేసినా ఉపయోగం లేకుండాపోయిందన్నారు. మానవహక్కులే అక్కడ లేవని ఐక్యరాజ్య సమితి ఆందోళన వెలిబుచ్చిందన్నారు. సాయుధదళాల ప్రత్యేకాధికారాల చట్టం మరో ఆరు నెలలు అమలుంటుందని ప్రకటించడం ప్రభుత్వ రాజ్యహింసకు నిదర్శనమన్నారు. బిజెపి తప్పిదం ఏమి లేదని చెప్పాలంటే మణిపూర్‌ను ప్రధాని తక్షణమే సందర్శించి శాంతిభద్రతలు పునరుద్దరించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మణిపూర్ సర్కార్‌ను బర్తరఫ్ చేయాలన్నారు.

## ఉపాధిపనులను పరిశీలించిన డ్వామా పిడి

**మర్రిపాడు, అక్టోబర్3, ప్రభాతవార్త:** నందవరం గ్రామంలో ఎంఐ ట్యాంక్ (చెరువుకట్ట) వద్ద జరుగుతున్న మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాదిహామీపని ప్రదేశాన్ని మంగళవారం డ్వామా పిడి డి.వెంకటరావ్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాది కూలీలు కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు సరిపడా వేతనం 272రూపాయలు వర్తిస్తుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ కొలతల ప్రకారం పనిచేయాలని అదేవిధంగా 100రోజుల పనికి గాను 27,200రూపాయలు వేతనం పొందుతారని తక్కువ కొలతలతో పనిచేస్తే కూలీ రూపంలో నష్టపోతారని ఎండ తీవ్రత దృష్ట్యా 6నుంచి 11గంటల లోపు పనులు పూర్తిచేసుకోవాలని ఆయన కూలీలకు సూచించారు. ఇసి మల్లిఖార్జునరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ డి.రవీంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ షేక్ ఖాదర్‌బాషా, గాలిబోయిన రామ్మోహన్ పాల్గొన్నారు.

# సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం



**వెంకటాచలం, అక్టోబర్ 3, ప్రభాతవార్త:** సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారంచుట్టారని రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు.మండల పరిధిలోని నిడిగుంటపాళెం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని మంత్రి ప్రారంబించారు.తోలుత సుకక్ష వైద్యశిభిరంలో ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్క్, స్పాట్ రిజిస్ట్రేషన్, ల్యాబ్,రక్తపరీక్షలు, క్షుణ్ణంగ పరీక్షించారు.అనంతరం మంత్రి మాట్లాడుతు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పదకాన్ని ఇంటివద్దకే తీసుకురావడంతోపాటు ప్రజలకు అత్యంత విలువైన వైద్యాన్ని గ్రామంలోనే వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేయడం రాష్ట్ర చరిత్రలో మరుపురాని విషయమన్నారు.పేదవాడు ధనవంతుడితో సమానంగ వైద్యం పొందేందుకు ఆరోగ్యశ్రీ రూపొందించిన ఘనత స్వర్గీయ వై.ఎస్ రాజశేఖరరెడ్డికే దక్కిందన్నారు.షుమారు మూడు వేలకుపైగా వ్యాదులను ఆరోగ్యశ్రీలోచేర్చి పేదవాడికి మరింత ఆరోగ్యభద్రత కల్పించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు.ఆరోగ్యవంతమైన కుటుంబాలు ఆనందంగ ఉంటాయని ప్రతి కుటుంబంలో సంపూర్ణ ఆరోగ్యవంతులుగ తీర్చిదిద్దాలన్న సంకల్పంతో జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. దేశచరిత్రలో ఎక్కడాలేని విదంగ ప్రజలకు అవసరమైన వ్యాదులగూర్చి ఆలోచనచేసి ఇంటి గడపదాటి బయటకు రాకుండ వైద్యం అందించడం శుబపరిణామమన్నారు.పూర్తిస్తాయిలో గ్రామంలో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి డాక్టర్లచే వైద్యం ఉచితంగ అందజేసి మందులు అందజేస్తామన్నారు.ఈకార్యక్రమంలో డి.ఎం అండ్ హెచ్ ఒ పెంచలయ్య, డి.ఎల్.డి.ఒ వసుమతి,స్తానిక నాయకులు ఉప ఎం.పి.పి కనుపూడి కోదండరామిరెడ్డి, మండల కన్వీనర్ మోహన్‌నాయుడు,జిల్లా వై.సి.పి ఉపాధ్యక్షుడు మండల వెంకటశేషయ్య,కట్టంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ



**నెల్లూరు అర్బన్, అక్టోబరు 3, ప్రభాతవార్త** జిల్లాలో రాష్ట్ర ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం చేపట్టామని జిల్లాకలెక్టర్ ఎం.హరినారాయణన్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు తెలియజేశారు. మంగళవారం ఉదయంవిజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశమై ఓటర్ల జాబితాల ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా రీవెర్ఫికేషన్ ఆఫ్ డిలీషన్స్, చనిపోయిన, డూప్లికేట్, బోగస్ ఓట్లు జాబితాపై రాజకీయ పార్టీలు సమర్పించిన ఫిర్యాదులపై వివరణ, హౌస్ టు హౌస్ వెరిఫికేషన్, ఎపిక్ జనరేషన్ అండ్ స్టేటస్, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఓటర్ల సవరణలో భాగంగా ఫారం 6,7,8 కింద వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, డ్రాఫ్ట్ నోటిఫికేషన్ తయారీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ పాల్గొని జిల్లాలో చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమ వివరాలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించడం జరిగింది. ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ జిల్లాలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా జనవరి 6, 2022 తేదీ నుంచి వచ్చిన డెత్, షిఫ్టింగ్ కేసులు అన్నింటిని పున పరిశీలించి, రీవెరిఫికేషన్ పక్రియను పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిక వివరించారు. జిల్లాలో ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి వారం సమీక్షిస్తున్నామని, వారి సూచనలతో పాటు సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫాం-6,7,8లను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని క్లియర్ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి తెలిపారు. హౌస్ టు హౌస్ వెరిఫికేషన్ పక్రియను కూడా పూర్తి చేయడం జరిగిందని వివరించడం జరిగింది. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఎపిక్ కార్డుల జనరేషన్ పక్రియను చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు 36 వేల ఎపిక్ కార్డులు జనరేట్ చేయడం జరిగిందని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సంబంధిత దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**నెల్లూరు అర్బన్, అక్టోబరు 3, ప్రభాతవార్త** జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన రెవెన్యూ సంబంధిత దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాల్సిందిగా తహశీల్దార్లను జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్‌లో కావలి నియోజకవర్గ రెవెన్యూ సంబంధిత సమస్యలపై ఎమ్మెల్యే ఆర్.ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆర్డీఓ, తహశీల్దార్లతో సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించుచున్న జగనన్నకు చెబుదాం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో వచ్చిన రెవెన్యూ పరమైన అర్జీలను పరిష్కరించుటకు అన్ని విధాల కృషి చేయాలన్నారు.గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఏ మేరకు అమలు చేశారో మండలాల వారీగా సమీక్షించారు. నిర్ధేశించిన వ్యవధిలోపు అన్ని సమస్యలను పరిష్కరించాలన్నారు.

ముఖ్యంగా అసైన్‌మెంట్ భూములకు సంబంధించి దరఖాస్తులను నిబంధనల మేరకు పరిష్కరించాలన్నారు. నోషనల్ ఖాతాలను ప్రారంభించుటకు తగు ప్రతిపాదనలను వెంటనే పంపాలన్నారు. సాదాబైనామ అర్జీలను సరైన కారణం లేకుండా తిరస్కరించడం తగదన్నారు. ప్రజల అవసరాలను తీర్చడంలో బాధ్యతగా పనిచేయాలన్నారు. అదే విధంగా సాగుబడిలో ఉన్న భూమికి అర్హతల మేరకు హక్కు కల్పించుటకు చర్యలు తీసుకోవాలన్నారు. భూ సంబంధ సమస్యలు పరిష్కరించే క్రమంలో క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ రోనంకి కూర్మనాథ్, సర్వే ల్యాండ్ ఏడీ హనుమాన్ ప్రసాద్, కావలి ఆర్డీఓ శివనాయక్, కావలి, బోగోలు దగదర్తి, అల్లూరు మండల తహశీల్దార్లు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్షని సద్వినియోగం చేసుకోండి



**నెల్లూరు అక్టోబర్ 3, ప్రభాతవార్త-వైద్యం** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షని సద్వినియోగం చేసుకోవాలని విజయడైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రూరల్ నియోజకవర్గం పరిధిలోని 22వ డివిజనులో ఉన్న లెప్రసీ ఆసుపత్రిలో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లో నెల్లూరు పార్లమెంటు సభ్యుడు ఆదాల ప్రభాకరెడ్డి సూచనల మేరకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్‌లతో కలిసి రంగారెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మూలే భాస్కర్‌రెడ్డి, ఒరిస్సా శ్రీనివాసులురెడ్డి, మొయిళ్ళ గౌరి, తాళ్ళూరి అవినాష్, జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి వేలూరు శివ, సునీల్‌కుమార్‌రెడ్డి, సిహెచ్ హరిబాబుయాదవ్, మండల జెసిఎస్ కన్వీనర్ మొయిళ్ళ సురేష్‌రెడ్డి, ముడియాల రామిరెడ్డి, పాతపాటి పుల్లారెడ్డి, వేలూరు శ్రీధర్‌రెడ్డి, యాకసిరి శరత్‌చంద్ర, కువ్వా కొల్లు బాబ్జీయాదవ్, సన్నపురెడ్డి వెంకటసుబ్బారెడ్డి, షేక్ నవాబ్‌జాన్, మల్లిఖార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుత ర్యాలీని జయప్రదం చేయండి

**నెల్లూరు అక్టోబర్ 3, ప్రభాతవార్త-వైద్యం** టీడీపీ, జనసేన, సీపీఐ ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా ఉమ్మడి నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ, జనసేన, సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 4గంటలకు జరిగే శాంతియుత ర్యాలీని విజయవంతం చేయాలని నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌అజీజ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ర్యాలీ నగరంలోని విఆర్సీ కూడలి నుండి మొదలై గాంధీబొమ్మ సెంటర్ వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం బాపూకు చెపుతాం కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. పార్టీలకి అతీతంగా అందరూ పాల్గొని అక్రమ అరెస్టును ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు.

# మళ్లీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డే



**మనుబోలు, అక్టోబర్ 3, ప్రభాతవార్త:** మళ్ళీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ ఫుడ్‌ప్రాసెసింగ్ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నొక్కొవక్కాణించారు. మండలకేంద్రమైన మనుబోలులో పడూరురోడ్‌లో అంబేడ్కర్‌నగర్ కాలనీలో సిమెంటు రోడ్లు ప్రరంబించి సచివాలయంవద్ద మీడియాతో మాట్లాడారు.వివిద సర్వేలు మళ్ళీ జగన్‌మోహన్‌రెడ్డి గ్రాఫ్ పెంచేల సూచిస్తున్నాయని తెలిపారు.అన్ని వర్గాల అభివృద్ధి సంక్షేమపదకాలే తమ ప్రభుత్వానికి సోపానాలన్నారు.స్కిల్ డవలప్‌మెంట్‌లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దోషిగ జైలుకుపోయాడని చెప్పాడు.మాజీ మంత్రులు విక్రమసింహపురి యూనివర్సిటి,ఆదిశంకర కాలేజివద్ద డ్రామాలాడారని కాకాణి విమర్శించారు.మండలంలోని కుడితిపల్లి గ్రామంలో తాను గడప,గడపకు కార్యక్రమానికి వెళ్ళినపుడు ఈనాం భూములు గురించి రైతలు తనదృష్టికి తెచ్చారని ఆగ్రామ ఈనాంభూములను త్వరలో షటిల్‌మెంట్ భూములుగ మారుస్తున్నట్లు కాకాణి తెలిపారు.ఒక్క మనుబోలు గ్రామంలో 12కోట్ల రూపాయలు నిధులు మంజూరుతో అభివృద్ధి పనులు చేశానని తెలిపారు.గతంలో ఏఎం.ఎల్.ఎ అయినా ఇంత భారీ ఎత్తున నిధులు తెచ్చార అని ప్రశ్నించారు.చంద్రబాబునాయుడ్ని అరెస్ట్ చేసిన తరువాత మనుబోలులో నియోజకవర్గస్తాయి తెలుగుదేశంపార్టీ నాయకుల నిరసన కార్యక్రమంలో ఒక్కశాతంమంది నాయకులు కార్యకర్తలుకూడా పాల్గొనలేదని వారి నిరసన అంతా ప్యాకేజిమయమని వ్యంగ్యాస్త్రాలు విసిరారు.ముందుగ మంత్రికి గ్రామంలో స్తానిక నాయకులు ఘనస్వాగతం పలికారు.మనుబోలు అంబేత్కర్‌నగర్‌నుండి సిమెంటురోడ్ ప్రారంబించి కాలినడకన సచివాలయానికి రావడంతో అదికారులు నాయకులకు పాదయాత్రను మరిపించిందిం ఈకార్యక్రమంలో గుండాల వజ్రమ్మ,సర్పంచ్ కంచి పద్మమ్మ,ఉపసర్పంచ్ కడివేటి చంద్రశేఖరరెడ్డి,ఎం.పి.టి.సి దువ్వూరు రాజేశ్వరి,మండల పార్టీ కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి,నెస్కేప్ డైరెక్టర్ దాసరి భాస్కర్‌గౌడ్,వై.సి.పి సీనియర్ నాయకులు మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి,చిట్టమూరు అజయ్‌కుమార్‌రెడ్డి,ఏడెం మల్లికార్జునరెడ్డి,నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి,మన్నెమాల సుధీర్‌రెడ్డి,చల్లా నవకోటి అదికారప్రతినిది దాసరి మహేంద్రవర్మ, గుమ్మడి వెంకటసుబ్బయ్య, సోషల్‌మీడియా ఇన్‌చార్జ్ గుంజి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు,అక్టోబర్3 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు ఆధీనంలో ఉన్న శివాయి, పోరంబోకు భూములు సాగు చేస్తున్న వారు వారి అర్హతలను బట్టి ఈ భూముల కోసం నిర్వహిస్తున్న గ్రామ సభల్లో అర్జీలు ఇవ్వాలని తహసీల్దార్ ఎం. పద్మజ అన్నారు. కోవూరు మండలం లేగుంటపాడు, ఇనమడుగు, పడుగుపాడు గ్రామ పంచాయతీల్లో మంగళవారం వీటికి సంబంధించి గ్రామ సభలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత సంవత్సరాలుగా ఇటువంటి భూములను సాగు చేసు కుంటున్న సన్నకారు రైతులు అసైన్‌మెంట్ పట్టాల కోసం నిర్వహిస్తున్న ఈ గ్రామ సభల్లో పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని అర్జీలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం కల్పించిన ఇటువంటి మంచి అవకాశాన్ని సన్నకారు రైతులు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు జెట్టి రాజగోపాల్‌రెడ్డి, డి. ప్రమీలమ్మ, లక్ష్మీనారాయణ, గ్రామ రెవెన్యూ అధికారులు డి.నాగేశ్వరరావు, మల్లికార్జున, నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, తదితరులు ఉన్నారు.

## కృత్రిమ గర్భధారణపై అవగాహన పెంచుకోవాలి



**కోవూరు,అక్టోబర్3 ప్రభాతవార్త :** రైతుభరోసా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న పశు సహాయకులు కృత్రిమ గర్భధారణపై మరింత అవగాహన పెంచుకోవాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య తెలిపారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పశు వైద్యశాలలో మంగళవారం గాదెలదిన్నె ఆర్‌బీకేలో పనిచేస్తున్న సుభాషిణి, తదితరులకు ఈ విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ప్రతి ఆర్‌బీకే పరిధిలో ఉన్న పాడి రైతులకు కృత్రిమ గర్భధారణతో పాటు మేలుజాతి పెయ్యదూడల పథకంపై కూడా మరింత అవగాహన కల్పించేలా పశు సహాయకులు చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులపై వారికి అవగాహన కల్పించేలా దృష్టి పెట్టాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామాల్లో అమలు చేసేలా పశు సహాయకులు తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సజ్జాద్, తదితరులు ఉన్నారు.

## నిజాయితీగా అభివృద్ధి పనులు చేస్తున్నాం




**కోవూరు,అక్టోబర్3 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ పరిధిలో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారం డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి చొరవతో ప్రజలకు అవసరమైన అన్ని పనులను నిజాయితీగా చేస్తున్నామని, కేవలం కొంతమంది తమ ఉనికిని కాపాడుకునేందుకు తమపై లేనిపోని విమర్శలు చేస్తున్నారని సర్పంచ్ లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ చంద్రమౌళి నగర్ ప్రాంతంలో ప్రజలకు అవసరమైన సిమెంట్ రోడ్లు, మురికి కాలువలను ఏర్పాటు చేయడం జరిగిందని, అర్హత కలిగిన వారిందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చొరవ తీసుకుంటున్నా ఈ గ్రామంలోని ఒక వ్యక్తి తనపై లేనిపోని ఆరోపణలు చేయడం ఎంతవరకు సబబన్నారు. అటువంటి ఆరోపణలు చేసే వ్యక్తి ఇటువంటి గ్రామ సభలకు వచ్చి మాట్లాడితే బాగుంటుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం ఎంపీడీవో శ్రీహరి మాట్లాడుతూ ఇటువంటి గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకుని గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పద్మజ, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, గ్రామ రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసూన, వెలుగు సీసీ రాము, వార్డు సభ్యులు అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు ఉన్నారు.

## ఇన్సూరెన్స్ పథకంపై అవగాహన పెంచుకోవాలి



**కోవూరు, అక్టోబర్3 ప్రభాతవార్త :** కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం పంచాయతీ గ్రామ సచివాలయంలో మంగళవారం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు ఇన్సూరెన్స్ నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల జేసీఎస్ కన్వీనర్ ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు ప్రత్యేకంగా భరోసా కలినపంచేందుకే అటువంటి వారికి జీవిత భీమా సౌకర్యాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. ఇటువంటి అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ సర్పంచ్ శ్రీవాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏ పథకం ప్రవేశపెట్టినా అది ఒక చరిత్రే అన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా, ప్రసన్నకుమార్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించేలా ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

## గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలి



**కోవూరు,అక్టోబర్3 ప్రభాతవార్త :** గ్రామాన్ని స్వచ్ఛ నరగామాలుగా మార్చేందుకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని గ్రామ సర్పంచ్ వై. విజయ తెలిపారు. కోవూరు పంచాయతీలో నిర్వహించిన గ్రామ సభలో ఆమె మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించి సకాలంలో ఇంటి పన్నులు, కుళాయి పన్నులు చెల్లించి తమవంతు సహకారం అందించాలన్నారు. అదేవిధంగా చెత్తాచెదారాలను ఎక్కడంటే అక్కడ పడవేయకుండా పంచాయతీ ఏర్పాటు చేసిన చెత్త కుండీలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా పాలకవర్గం, తాము కృషి చేస్తూనే ఉన్నామన్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు గ్రామ సభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మైనుద్దీన్, వార్డు సభ్యులు అనూప్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జుబేర్‌బాషా, తదితరులు ఉన్నారు.

## కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష



**కోవూరు,అక్టోబర్3 ప్రభాతవార్త :** కోవూరు ఆర్‌అండ్‌బీ అతిథి గృహ సమీపంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిసూనత కోవూరు టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం 21వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణిగా వ్యవహరిస్తూ నాలుగు సంవత్సరాలుగా కొనసాగుతున్న కేసుకు సంబంధించి ప్రస్తుతం మాజీ ముఖ్యమంత్రిని అరెస్టు చేయడం ఎంతవరకు సబబన్నారు. ప్రజల్లో టీడీపీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్చుకోలేక ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమానికి పూనుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు జైలు నుంచి విడుదలయ్యే వరకు ఈ నిరాహార దీక్షలు నిరాటంకంగా కొనసాగుతాయన్నారు. ప్రజల్లో టీడీపీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఈ దుష్ట ప్రభుత్వం దొంగ కేసులను బనాయించిందన్నారు. ఎవరెన్ని నాటకాలు వేసినా రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. శనివారం దీక్షలోఎంపీటీసీ సభ్యులు సునీల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెలగపూడి శ్రీనివాసులు,, నాటకరాణి వెంకట్, మహేష్, బాల రవి, తదితరులు ఉన్నారు.

## పులికల్లు గ్రామంలో స్వచ్ఛత హిసేవ



**పొదలకూరు అక్టోబర్ 2 ప్రభాతవార్త :** పొదలకూరు మండలం పులికల్లు గ్రామంలో స్వచ్ఛత హిసేవ కార్యక్రమాన్న నిర్వహించారు. నాలుగు కేటగిరిలకు సంబందించి సర్పంచ్ జి.వి సుబ్బమ్మ ఆధ్వర్యంలో కార్యదర్శి మాదవి వివిధ కార్యక్రమాలు చేపట్టారు.శ్రమదాన్ రిపేర్లు,ప్రజల బాగ్యస్వామ్యం చేస్తు పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు చేశారు. విద్యార్దులు టీచర్లతో ప్రజలతో స్వచ్ఛత ర్యాలీ,మానవహారం,గ్రామసభ, నిర్వహించారు. ఏక్‌తారీక్ ఏక్ గంట శ్రమదన్ కింద బస్టాండ్ ,వాటర్ ట్యాంక్,ఎస్‌డబ్ల్యూపిసి షెడ్ పరిసరాలు రోడ్డు శుభ్రం చేయడం,చెత్త సేకరణ రిక్షాలు రిపేరు చేయించడం,స్లోగన్లు రాయించడం వంటివి పండుగ వాతావరణంలో పంచాయితీలో చేపట్టారు. తొలుత గ్రీన్ అండాసిడర్‌లకు గ్రీన్‌గార్డుకు ఈ సందర్బంగా పూలదండలుతో సర్పంచ్ కార్యదర్శి నాయకులు,ప్రజలు అందరు కలిసి ఘనంగా సత్కరించారు.

## తాగునీటి సమస్యను తీర్చండి మహాప్రభో



**సీతారామపురం అక్టోబర్ 3 ప్రభాతవార్త :** సీతారామ పురం మండల పరిధిలోని పబులేటిపల్లి గ్రామంలో మంచినీటి సమస్య ,పారిశుద్య సమస్య తీవ్ర రూపం దాల్చడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బం దులకు గురౌతు న్నా రు. అధికారులను అడిగితే పంచాయితీలో నిధులులేవని చెబుతున్నారని గ్రా మస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.త్రాగు నీటి కోసం ట్యాంకర్ల వెంబడి పరిగిత్తె పరిస్దితులు తలె త్తా యని కనీస వసతులకు కూడా నీరు అందకపో వ దంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నా రు. గత కొద్ది రోజులు నుండి గ్రామంలోని టి.కాశయ్య అనే వక్తి తన సొంత నిధులు వెచ్చించి కొన్ని ట్యాంకర్ల నీళ్లను గ్రామాంలోని ప్రజలకు అందించారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు నీటి సమస్య తీర్చాలని గ్రామస్తులు విన్నవించుకుంటు న్నారు.

## కిడ్ని వ్యాది గ్రామస్తురాలికి కాకర్ల ఆర్దిక సహాయం




**సీతారామపురం అక్టోబర్ 3 ప్రభాతవార్త :** సీతారామపురం మండలం మారంరెడ్డిపల్లి గ్రామంలో కలివెల తిరుపతమ్మ గత కొంతకాలంగా కిడ్నివాధ్యితో పడుతున్న విషయం గ్రామస్తులు కాకర్ల చారిటబుల్ ట్రస్టు అధినేత కాకర్ల సురేష్‌కి తెలుపగా వెంటనే స్పందించి న సురేష్ ఆకుటుంబానికి పదివేల రూపాయాలు ఆర్దిక సహాయం అందించారు. కుటుంబసభ్యులు కాకర్ల సురేష్‌కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

**సైదాపురం, అక్టోబరు 3, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరం లాంటిదని ఎంపీడీఓ మీసాల వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలోని కొమ్మిపాడు గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు మంగళవారం నిర్వహించారు. ఈసందర్బంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో రూపాయి ఖర్చు లేకుండా పేదలకు మంచి ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. కొమ్మిపాడు విలేజ్ క్లీనిక్ పరిధిలో ఉన్న సుమారు 320మందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని, వారిలో 135 మందికి జగనన్న కంటి వెలుగు ద్వారా కంటి పరీక్షలు, 24 మంది విద్యార్థులకు జనరల్ వైద్య పరీక్షలు, అదే విధంగా బాలింతలు, గర్భవతులైన 7మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఏవో పురుషొత్తం శివకుమార్, తహశీల్దార్ శ్రీనివాసులు, జేసీఎస్ మండల కన్వీనర్ గుంటమడుగు శ్రీనివాసరాజు, గ్రామ సర్పంచ్ స్రవంతి, ఎంఈఓ దయాకర్, వైద్యులు జనార్ధన్, శ్రావణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**వరికుంటపాడు, అక్టోబర్ 3,ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఉన్న ప్రజలందరికి నాణ్యమైన ఉచిత వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమనీ మండల పరిషత్ అధ్యక్షురాలు గవదకట్ల వెంకటలక్ష్మమ్మ అన్నారు.మండంలోని వేంపాడు గ్రామంలో మంగళవారం ఎంపిడిఓ శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎంపీపీ గవదకట్ల వెంకట లక్ష్మమ్మ ముఖ్యఅథిధిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమములో అందుతున్న వైద్య సేవలను ఆమె పరిశీలించారు.అలాగే ఆమె కూడా వైద్య పరిక్షలు చేయించుకున్నారు.అనంతరం జరిగిన సమావేశంలో ఎంపీపీ గవదకట్ల వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన పరిపాలన లో విద్యా,వైద్యానికి ప్రాముఖ్యత కల్పించారన్నారు.జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే ఉన్నత ఆశయంతో ,దేశంలో ఎక్కడా చేయనీ విధంగా సామాన్యుల చెంతకే వైద్య సేవలను తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కే దక్కుతుందన్నారు.ఈ వైద్య శిబిరాలలో అనేక రకాల పరిక్షలు నిర్వహించి,ఉచితంగా మందులు అందజేస్తునారనీ,కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనీ కోరారు.ఈ కార్యక్రమములో మండల విద్యాశాఖాధికారి రమణయ్య, ఉప సర్పంచ్ నరేష్,స్థానిక వైసిపి నేతలు గవదకట్ల మల్లికార్జున,అబ్దులేమ్ ,వైద్యాధికారులు అయోషా,కరిష్మా,ఐసిడిఎస్ సూపర్‌వైజర్,ఈఓఆర్డి సికిందర్,పంచాయితీ కార్యదర్శులు పి.రవీంద్ర,బి.హరి,జిలానీ,మౌలాలి,మలేరియా సబ్ యూనిట్ నౌషద్ బాబు,టిబి సూపర్‌వైజర్ బోగ్యం వెంకటేశ్వర్లు,వైద్యసిబ్బంది,సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ ఇన్‌సెంట్ పరిక్షలు వాయిదా వేయాలి



**వింజమూరు,అక్టోబర్3,ప్రభాతవార్త :** విక్రమ సింహపురి యూనివర్శిటీ పరిధిలో డిగ్రీ ఇన్‌సెంట్ పరిక్షలను వెంటనే వాయిదా వేయాలని లేకుంటే పరిక్షలను అడ్డుకుంటామని నెల్లూరు జిల్లా అఖిల భారత విద్యార్థి పరిషత్ కన్వీనర్ మల్లవరపు అశోక్‌రెడ్డి హెచ్చరించారు. ఎబివిపి నగర శాఖ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బిఎస్‌యు పరిధిలో డిగ్రీ ఇన్‌సెంట్ పరిక్షలు వాయిదా వేసి వెంటనే 2,4 సెమిస్టర్ ఫలితాలు విడుదల చేయాలని మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ విక్రమసింహపురి యూనివర్శిటీ పరిధిలో 3సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు యూనివర్శిటీ అధికారులు అన్యాయం చేస్తున్నా రన్నారు. అక్టోబర్ 5నుండి ఇన్‌సెంట్ పరిక్షలు నిర్వహించడం సమంజసం కాదన్నారు. 2,4సెమిస్టర్ల ఫలితాలు విడుదల చేయకుండా ఇన్‌సెంట్ పరిక్షలు నిర్వహిస్తారని ప్రశ్నించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా యూనివర్శిటీ అధికారులు నిర్వహించడాన్ని ఎబివిపి తీవ్రంగా ఖండిస్తున్నారు . ఈ నిర్ణయం వలన జిల్లా వ్యాప్తంగా అభ్యర్థులు నష్టపోతారన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని 2,4 సప్లమెంటరీ ఫలితాలు విడుదల చేసి తర్వాతే పరిక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని యూనివర్శిటీ అధికారులు పలుమార్లు తెలియజేసినా వారు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయమన్నారు. ఈకార్యక్రమంలో ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, నగర కార్యదర్శి విష్ణు, విద్యార్థి సంఘనాయకులు శ్యామ్ ,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎ.కిస్తీపురంలో పశువిజ్ఞానబడి



**వింజమూరు, అక్టోబర్3,ప్రభాతవార్త:** మండలంలోని ఆరవీటికిస్తీపురంలో మంగళవారం చాకలికొండ పశువైద్యాధికారి కొమ్మికోటేశ్వరరావ్ ఆధ్వర్యంలో పశుపోషకులకు పశువిజ్ఞానబడిని నిర్వహించారు. ఈనేపథ్యంలో పశుపోషకులకు పశుపోషణలో తగు సలహాలు, సూచనలతోపాటు పశువులకు ఆరోగ్య హెల్త్ కార్డును డాక్టర్ కొమ్మికోటేశ్వరరావ్ పంపిణీ చేశారు.కిసాన్ క్రెడిట్ కార్డు గురించి వివరించి అందజేశారు . జీవాలకు నట్టల నివారణ, గొంతువాపు వ్యాధులు రాకుండా టీకాలను అందించారు.ఈకార్యక్రమంలో పశువైద్య సహాయకులు కె.హజరత్తయ్య, పశువైద్య సిబ్బంది భార్గవ్, మహేష్, కృష్ణ, పాడి , జీవాల రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా బూదాల



**వింజమూరు,అక్టోబర్3,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ఎస్సీ,ఎస్టీ గ్రామ, వార్డు , సచివాలయ సంఘం రా ష్ట్ర కార్యనిర్వాహక కార్యద ర్శి వింజమూరు మండలం నందిగుంటకు చెందిన బూదాల వెంక టేశ్వర్లు నియమితులయా ్యరు. ఇటీవల విజ యవాడలో జరిగిన ఆల్ ఎపి ఎస్సీ,ఎస్టీ గ్రామవార్డు, సచివాలయ ఉద్యోగుల సం ఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అధ్యక్షులు బి.రవికుమార్, రాష్ట్ర సమన్వయకర్త , కార్యనిర్వాహక అధ్యక్షులురత్నకుమార్, వర్కింగ్ ప్రెసి డెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బూదాల వెంకటేశ్వర్లును ఎంపిక చేశారన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కమిటీలను పూర్తిచేయడం, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ జిల్లాలోని మండల కమిటీలను , మున్సిపాల్టీ కమిటీలను , కార్పోరేషను కమిటీలను ఏర్పాటు చేసి సంఘాన్ని బలోపేతం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు ఆదేశించారని కోరారు.

## గ్రామస్థాయిలో మెరుగైన వైద్యం



**వింజమూరు,అక్టోబర్3,ప్రభాతవార్త:** ముఖ్యమ ంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గ్రామస్థాయి నుండి ప్రజలకు కార్పోరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ కన్వీనర్ రేవునూరి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు . మంగళవారం మండలంలోని గుండెమడకల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంపిడిఓ రాజేష్ బాబు ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ చీదర్ల పుల్లయ్య , ఎంపిటిసి సభ్యులు ఉంటా రత్నమ్మ , నల్లగొండ్ల మాజీ సర్పంచ్ లెక్కల శ్రీనివాసులురెడ్డి , జెసిఎస్‌కన్వీనర్ పల్లాల ప్రసాద్‌రెడ్డి నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా డ్వామా పిడి వెంకట్రావ్, తహసిల్దార్ చొప్పా రవీంద్రబాబులు హాజరయ్యారు . ఈసందర్భంగా మండల కన్వీనర్ రేవునూరి శ్రీనివాసరావ్ మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం ఏర్పడిన నాలుగున్నర సంవత్సరాల కాలంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో అనేక సంస్కరణలు తీసుకువచ్చి ప్రజలవద్దకే పాలన లక్ష్యంతో కొనసాగిస్తున్నారన్నారు. గతమెన్నడూ లేని విధంగా గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను సచివాలయాల ద్వారా అందిస్తున్నారన్నారు. రైతులకు రైతుభరోసాకేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తున్నారన్నారు. వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ ద్వారా గ్రామీణ ప్రజలకు ఖర్చుతో కూడిన అన్నిరకాల పరిక్షలు నిర్వహిస్తూ ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నా రన్నారు. ప్రస్తుతం ప్రజలకు ఇంకా మెరుగైన వైద్యసేవలు అందించాలన్న ఉద్దేశంతో జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని రూపొందించి ప్రజలవద్దకే వైద్యాధికారులను , సిబ్బందిని పంపి ప్రతి కుటుంబంలో ఉన్న వారి అనారోగ్య బాధితులను గుర్తించి వారందరికీ ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పరిక్షలు నిర్వహించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా జగనన్న కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఈకార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని కోరారు. అనంతరం శిబిరంలో వైద్యపరిక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భవతులకు శ్రీమంతాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ ఎల్.సృజన, సిడిపిఓ పద్మజాకుమారి, సి.హెచ్.ఓ.గిరికుమారి, సూపర్‌వైజర్ అంబటి వెంకటేశ్వర్‌రెడ్డి, సూపర్‌వైజర్ ఎ.ఝాన్సీ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, , పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య, స్థానిక నాయకులు చీమల హజరత్‌రెడ్డి, వైద్యఆరోగ్య సిబ్బంది సి.హెచ్.మల్లిఖర్జున, సి.హెచ్.గురవయ్య, చిన్నయ్య, ఎఎన్ఎంలు, ఆశావాలంటీర్లు పాల్గొన్నారు.

## కుక్కతోక వంకర అనే సామెతను నిజం చేస్తున్న ఎమ్మెల్యే



**కొడవలూరు అక్టోబర్ 3 ప్రభాతవార్త:** కుక్కతోక వంకర అనే సమెతను నిజం చేస్తున్నా ఎమ్మెల్యే ప్రస్నకుమార్‌రెడ్డి వైఖరి తెలుపుతుందిని అని కోవూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి వెల్లడించారు. తెలుగుదేశంపార్టీ అదేశాలు మేరకు కోవూరు నియోజకవర్గం టిడిపీ ఇన్‌చార్జ్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి " ప్రతి అడుగు ప్రజల కోసం కార్యక్రమాన్ని మంగళవారం కొడవలూరు మండలం, కొత్తవంగల్లు గ్రామంలోని శ్రీనివాసపురం, క్రైస్తవపాలెం, రాయలసీమ గిరిజన కాలనీల గ్రామస్తుల ఇంటింటికి వెళ్లి గడిచిన నాలుగేళ్ల వైసీపీ ప్రభుత్వం పాలనలో ప్రజలును మోసగించిన తీరును మరియు భవిష్యత్తుకు గ్యారంటీ ఇసూ.. .తెలుగుదేశం పార్టీ హామీలుగా ఇస్తున్న పథకాలను వివరిస్తూ కరపత్రలను ఇంటింటికి పంచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ ఈ గ్రామంలోని ఏ ఇంటికి వెళ్లినా ప్రజల చెప్పే మాట! టీడీపి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి చేసిన అభవృద్ధి తప్పా!! ఈ నాలుగున్నార ఏళ్ళలో వైసీపీ ప్రభుత్వం ఎటువంటి అభవృద్ధి జరగలే దని చెప్పటం జరిగింది అని తెలిపారు. అంతేకాక కొత్తవంగల్లు గ్రామస్తులు ముక్తకఠంగా టీడీపీ పార్టీని గెలిపించబోతున్నాం అని కోవూరు నియోజకవర్గం ఎమ్మెల్యే మీరే అని దినేష్‌రెడ్డికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. దీనికి కృతజ్ఞతగా వారికి గ్రామ సమస్యలను తీర్చాలని కోరుకున్నారు అని వాటిని ఖచ్చితంగా తీరుస్తాను అని తెలిపారు. పవన్ కళ్యాణ్, జగన్మోహన్‌రెడ్డిని, వైసీపీ ప్రభుత్వాని ఎందుకు విమర్శిస్తున్నాడు అనే విషయాని తెలుసుకోకుండా, ఎమ్మెల్యే ప్రస్నకుమార్‌రెడ్డి పవన్ కళ్యాణ్‌ను దత్త పుత్రుడు అని మాట్లాడే వైఖరిని మార్చుకోమని ఎదేవా చేశారు. అసలు ఈ కార్యక్రమంలో కొత్తవంగలు మాజీ సర్పంచ్ చెక్క నారయ్య, నెల్లూరు పార్లమెంట్ కార్యదర్శి చెక్క మదన్‌మోహన్, మండల కన్వీనర్ కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, నెల్లూరు పార్లమెంటరీ అధికార ప్రతినిధి చెముకుల కృష్ణచైతన్య, టీడీపీ కోవూరు నియోజకవర్గం పర్యేలకులు పోగిలి శ్రీనివాసులు, యల్లాయపాలెం ఎంపిటీసీ గరికపాటి రాజేంద్ర, కోదూరు బుజ్జిరెడ్డి, స్థానిక నాయుకులు మద్దల మల్లికార్జున్, దార్ల రాజశేఖర్, మన్నేపల్లి బక్తవత్సలు, వడ్డి శ్రీను, చెడమాల పెంచలబాబు, జ్యోతి సమన్, పూసల సాయి, గంగపట్నం ప్రసాద్, యాటగిరి వంశీ పాల్గొన్నారు

## బుచ్చి యువకుడికి అక్కినేని పురస్కారం

### కళాకారుడి బిడ్డ కళాకారుడే



**బుచ్చి అక్టోబర్ 3 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంకి చెందిన చినబాబు(చిత్రకారుడు) కుమారుడు కనిగిరి కాంక్షతేజ సినీ డైరక్టర్,ఎడిటర్ కాగా డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి మహోత్సవాలలో భాగంగా హైదరాబాద్‌లో ఆయువకుడ్ని సినియాక్టర్ల,సినిమి డైరక్టర్లు అభినందించి అక్కినేని పురస్కారం అంద జేశారు.సిని దర్శకుడు నిట్టల గోపాలకృష్ణా, సినినటుడు పృధ్వీరాజ్, సత్యశ్రీ, తిరుమల బ్యాంకు అధినేత చంద్రశేఖర్ తదితరులు కాంక్షతేజని అభినందించారు. కాంక్షతేజ తండ్రి చినబాబు బుచ్చిరెడ్డిపాళెం చిత్రకా రుడు కాగా ఆయన కుమారుడు కూడా సినిరంగంలో మంచి పేరు తెచ్చుకుండడంతో కళాకారుడి బిడ్డ కళాకా రుడే అంటు పలువురు అభినందనలతో ముంచెత్తారు.ఈ సందర్భంగా కాంక్షతేజ మాట్లాడుతు తన కుటుం బం చాలా పేదరికానికి చెందినదని,తనతండ్రి చినబాబు చిత్రకారుడుగా కాగా ఆయన ఆశయాలకు అణు గుణాంగా సినిరంగంలోకి రావడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు.

## బోగోలు బిట్ 2లో జగనన్న ఆరోగ్య సురక్ష



**బిట్రగుంట, అక్టోబరు 3 ప్రభాతవార్త** బోగోలు సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సురక్ష కార్యక్రమానుద్దేశించి మండల వైసిపి కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు మా ట్లాడుతూ ప్రతి పేద వాడికి మెరుగైన ఆరోగ్యాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. సచివాలయాల పరిధిలో వాలంటీర్ల సహకారంతో ప్రతి ఇంటిని మ్యాపింగ్ చేసి ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మేకల సుజాత, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, ఎంపిటిసి మందా కౌసల్య, సర్పంచ్ పందిపాటి అనిత, వైసిపి సీనియర్ నేత పర్రి అంకులయ్య, ఎంపిడివో అమ్మిశెట్టి వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలందరికి ఆరోగ్యం



**సంగం అక్టోబర్ 3 ప్రభాతవార్త** సంగం మండలంలోని దువ్వూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తహసిల్దారు నాగరాజు, ఎంపిడిఒ గోపి మా ట్లాడుతు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈకార్యక్రమం చాలా అద్భుతమైనదని వారు ప్రశం సించారు.రాష్ట్రంలోని ప్రజలందరు ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం ఈకార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని చెప్పారు. గ్రామంలో వాలింటర్లు సర్వే నిర్వహించి ప్రతి ఇంటిలో ఎవరు అనారోగ్యంతో ఉన్నారో గుర్తించడం జరుగుతుందని అన్నారు. వారందరికి వైద్యపరీక్షలు నిర్వహించడం జరుగుతుందని అవసరమైన వారికి ఆరో గ్యశ్రీ ద్వారా కార్పోరేట్ వైద్యశాలలో కూడా వైద్యం అందిచడం జరుగుతుందని తెలిపారు.ఈ సందర్భంగా స్పెషలిస్టులు డాక్టర్ జె.సంధ్యారాణి జనరల్ సర్జన్, డాక్టర్ ప్రతిమ,డాక్టర్ కుంతలశ్రీ ఆప్తమాలజిస్టు, డాక్టర్ రాకేష్, డాక్టర్ శ్రీనివాసులురెడ్డి ఫల్మనాలజిస్టు వైద్యపరీక్షలు నిర్వహించారు.ఈకార్యక్రమంలో వైసిపినా య కులు మదన్‌మోహన్‌రెడ్డి,మాజీ జడ్‌పిటిసి ఎం దేవసహాయం, ఇఒపిఆర్‌డి రమేష్‌బాబు, సెక్రటరీలు ప్రవీ ణ,అరుణ, గ్రామ నాయకులు మారెళ్ళ శ్రీనివాసులు,జెండాదిబ్బ నాయకులు కరకం బాకం శంకర య్య, మండల కో ఆప్షన్ మెంబర్ మన్సూర్,ఉపసర ్పంచ్ గుర్రం నరేష్ పాల్గొన్నారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్,అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలు విశేషంగా తరలివచ్చి పరీక్షలు చేయించుకున్నారు.

## అపస్ నూతన కార్యవర్గం

**బుచ్చి అక్టోబర్ 3 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్ ) మండల నూతన కార్యవర్గాన్ని బుచ్చిరెడ్డిపాలెంలోని అపస్ కార్యాలయంలో మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎం రవి, అధ్యక్షుడుగా కే.హజతర్,ఎం రవి, అధ్యక్షుడుగా కే.హజరత్,ప్రధాన కార్యదర్శిగా పి.మల్లికార్జున, సంఘటనా కార ్యదర్శిగా వి.రామకృష్ణారెడ్డి, ఆర్దిక కార్యదర్శిగా పి.వెంగయ్య, మహిళా కార్యదర్శిగా బి.వి ఉదయశ్రీలను ఏకగ్రీవంగా ఎను ్నకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు విలువలు దేశభక్తి,క్రమశిక్షణ, వ్యక్తిత్వాన్ని పెంపొందించడంలో ఆపస్ ముందుంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కెకె రాజగోపాల్,ప్రధాన కార్యదర్శి,ఎస్ చంద్రమౌళి,ఆర్దిక కార్యదర్శి మణికందాచారి,పబ్బురవి,వి రవికుమార్, జె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత



**కావలి రూరల్, అక్టోబరు 3 ప్రభాతవార్త** పర్యావరణాన్ని పరిరక్షించడం మనందరి బా ధ్యత అని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యా వరణాన్ని కాపాడుకోవాలని సంయుక్త సేవా సంస్థ సభ్యులు బుర్లా రఘుకుమార్‌రెడ్డి, గం ధం ప్రసన్నాంజనేయులు తెలిపారు. సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర ఆధ్వర్యంలో కావలి పట్టణం బాపూజీనగర్‌లోని కమ్యూనిటీ సెంటర్ నందు మంగళవారం 30 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సంయుక్త సే వా సంస్థ ద్వారా నేటికి 1710 మొక్కలను నా టడం జరిగిందన్నారు. కమ్యూనిటీ సెంటర్‌లో పనస, సపోట, నిమ్మ, బాదం వంటి 30 మొక్కలను నాటామన్నారు.ప్రతి ఒక్కరు తమవంతుగా ఒక్క మొక్కనైనా నాటి వాటిని సంరక్షించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతగా భావించి గంగపట్నం సురేంద్రను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించడానికి ఎంతో కృషి చేస్తున్న సురేంద్రను అభినందించారు.సంస్థ సభ్యులు యం.అజిత్‌బాబు, వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షులు షేక్ ఖాదర్‌బాషా,సంస్థ వాలంటీర్ మువ్వల దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి నూతన భవనం మంజూరు చేయాలి



**అనుమసముద్రంపేట, అక్టోబర్3, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఏఎస్‌పేట గ్రంథాలయం శిథి లావస్థకు చేరి శ్లాబ్ పెచ్చులూడిపడుతూ పాఠకు లకు ఇబ్బందికరంగా ఉన్న విషయాన్ని లైబ్రేరియన్ శ్రీనివాసరాజు మంగళవారం ఎంపిడిఒ కార్యాల యంలో ఎంపిపి బి.పద్మజారెడ్డికి అర్జీ ఇచ్చారు. నూతన భవన నిర్మాణానికి సహకరించాలని కోరా రు. అర్జీలు స్వీకరించిన ఎంపిపి సమస్యను శాస నసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి భవన నిర్మాణానికి చేస్తామన్నారు.

## ప్రతి ఒక్కరికి ఆరోగ్యరక్ష



**అనంతసాగరం, అక్టోబర్3, ప్రభాతవార్త:** ప్రజల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరికి ఆరో గ్య రక్ష ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకా రం చుట్టారని జెసిఎస్ కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి పేర్కొన్నారు. అనంతసాగరం మండలం ఎ.చిరువెళ్ళ గ్రామంలో మంగళవారం ఎంపిడిఒ ఎ.మధుసూధన్‌రావ్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో 343మందికి ఆరోగ్య పరిక్షలు నిర్వహించి ఉచితంగామందులు అందజేశారు. 150మంది జనరల్ మెడిసిన్, 96మంది అర్థోపెడిక్ , 15గైనకాలజి, 126కంటి పరిక్షలు చేయించుకున్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రతాపన్న చెప్పాడంటే చేసి చూపిస్తాడు



**కావలి రూరల్, అక్టోబరు 3 ప్రభాతవార్త** కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మా ట ఇస్తే చేసి చూపిస్తాడని కావలి పట్టణ 3వ వార్డు వైసిపి ఇన్‌చార్జ్ మండలి కృష్ణారావు తెలి పారు. కావలి 3వ వార్డులో ఎమ్మెల్యే ప్రతాప్‌కు మార్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం సిమెం ట్ రోడ్లు, సైడు కాలువల పనులను మండలి కృ ష్ణారావు ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి 3వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించి న ప్పుడు వార్డు ప్రజలు సిమెంటు రోడ్లు, సైడు కాలువలు దెబ్బతిని ఎంతో ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారన్నారు. త్వరలోనే వీటిని ఏర్పాటు చేస్తానని మాట ఇచ్చి నిధులు మంజూరు చేయించడంతో సిమెంట్ రోడ్లు, సైడు కాలువల పనులు చేపట్టామన్నారు. ఎమ్మెల్యే మాట ఇస్తే చేస్తాడని చెప్పడానికి ఇది ఒక నిదర్శనమని తెలిపారు. వార్డు ప్రజలు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## చోడవరంలో జగనన్న ఆరోగ్యసురక్ష



**జలదంకి, అక్టోబర్3, ప్రభాతవార్తః**జలదంకి మండలం చోడవరంలో మంగళవారం జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం నిర్వహించారు.స్తానిక సచివాలయ ప్రాంగణంలో జరిగిన క్యాంప్‌కు పలువురు రోగులు తరలివ చ్చారు.వారికి పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు మందులు పంపిణీచేశారు.ముందుగ రిజిస్ట్రేషన్ చేయించు కున్న వారే కాక సర్వే సమయంలో గ్రామంలో లేనివారుకూడా పరీక్షించుకున్నారు.అంగన్‌వాడీల ఆద్వర్యంలో గర్భ వతులకు జగనన్న కిట్లను పంపిణీచేశారు.ఈసందర్బంగ రోగులకు ఎలాంటి అటంకాలు కలుగకుండ తగుఏ ర్పాట్లు చేశారుక్యాంపును మండల వై.సి.పి కన్వీనర్ చేవూరి జనార్దన్‌రెడ్డి సందర్శించి పరీక్షలు మందుల పంపిణీ వంటివాటిని అదికారులను అడిగితెలుసు కున్నారు.ఎక్కడ లోపాలు తలెత్తకుండ అన్ని గా్గ్రత్తలు తీసుకోవాలని అదికారులకు సూచించారు.ప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగ చూడాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈఆరోగ్యసురక్ష కార్యక్రమానికి శ్రీకారంచుట్టారని కావున అందరు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.కార్యక్రమంలో ఎం.పి.డి.ఒ శ్రీధర్,తహసిల్‌దార్ పద్మావతి, ఎం.ఇ.ఒ శ్రీధర్,వింజమూరు ఐ.సి.డి.ఎస్ సి.డి.పి.ఒ పద్మజాకుమారి,డాక్టర్లు,సూపర్‌వైజర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.స్తానిక వై.సి.పి నేత కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## గ్రామ సభలతో రెవెన్యూ సమస్యల పరిష్కారం



**వరికుంటపాడు, అక్టోబర్3, ప్రభాతవార్తః** రెవెన్యు పరంగ నెలకొనివున్న సమస్యల పరిష్కారం కోసమే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసి ల్దార్ నేలపాటి మల్లికార్జున అన్నారు. మంగ ళవారం మండలంలోని రొంపిదొడ్ల ,రామా పురం,వరికుంట పాడు,కని యంపాడు గ్రామాలలో రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిం చారు .రొంపిదొడ్ల గ్రామంలో నిర్వహించిన గ్రామస భలో తహసిల్‌దార్ నేలపాటి మల్లికార్జున పా ల్గొని అర్జీలు స్వీకరించారు.ఈ సంద ర్బంగ ఆయ న మాట్లాడుతు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూముల్లో సాగు లోవున్న వారివద్ద నుండి అలాగే భూమిలేని వారివద్ద నుండి అర్జీలు స్వీకరించడం జరిగిందని ఉన్నతాదికారుల సూచనల మేరకు పరిష్కిరించడం జరుగుతుం దన్నారు.ఈకార్యక్రమంలో రీసర్వే డి.టి సరసారెడ్డి, వి.ఆర్.ఒలు శేషారెడ్డి,ఆంతోనిబాబు,సరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే ప్రభుత్వధ్యేయం



**వరికుంటపాడు, అక్టోబర్3, ప్రభాతవార్తః**రాష్ట్రంలో వున్న ప్రజలందరి సంక్షేమమే వై.కా.ప ప్రభుత్వ ధ్యేయ మని వరికుంటపాడు సర్పంచ్ కొండిపోగు దిలీప్‌కుమార్ అన్నారు.మంగళవారం వరికుంట పాడు, కనియంపాడు గ్రామాలలో నిర్వహించిన గ్రామసభల్లో రెవెన్యూ సమస్యలపై అదికారులతో కలసి అర్జీలు స్వీ కరించారు. ఈసందర్బంగ ఆయన మాట్లాడుతు రాష్ట్రంలో ప్రజాసంక్షేమమేధ్యేయంగ పరిపాలన సాగుతుందని రైతలకు అండగ నిలవడం కోసమే ఈగ్రామ సభలను చేపడుతున్నారన్నారు.వి.ఆర్.ఒ శేషారెడ్డి,వి.ఆర్.ఎ బానుచందర్,మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నేడు భూహక్కు-భూరక్ష పత్రాలు పంపిణీ



**కోవూరు, అక్టోబర్3 ప్రభాతవార్త :** కోవూరు మండలం పాటూరు ఉన్న పాఠశాల ప్రాంగణంలో బుధవారం పాటూరు పంచాయతీ పరిధిలోని రైతులకు నూతనంగా సిద్ధం చేసిన జగనన్న భూ హక్కు-భూరక్ష పత్రాలను ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరుగుతుందని మండల కన్వీనర్ సు బ్బారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల ప్రజాప్రతిని ధులు, పార్టీ నాయకులు హాజరు కావాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోండి



**ఉదయగిరి అక్టోబర్ 3 ప్రభాతవార్త** ఉదయగిరి మండలం లోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ డి ఈశ్వరమ్మ ఆ రోగ్య సురక్ష కార్యక్రమం మీద సమీక్ష సమావేశం నిర్వహిం చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష అనే కా ర్యక్రమాన్ని చేపట్టారని ఈకార్యక్రమం ప్రజలందరికి ఎంతో ఉపయోగపడుతుందని ఉదయగిరి మండల పరిధిలోని ప్రజ లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ నెల 30 వ తేది నుండి ఆరోగ్య పరీక్షలువిలేజ్ క్లీనికదగ్గర, అక్టోబర్ 5 వ తేది కృష్ణంపల్లి,అప్పసముద్రం 7 వతేది,10 వ తేది వెంగళరావునగర్,12 వ తేది జి.చెరువుపల్లి,బండగానిపల్లి 17 వ తేది,కొండాయపాళెం 21 వ తేది,19 వ తేది ఉదయగిరి బిట్ -1, ఉదయగిరి బిట్-2 (25 వతేది), తిరుమలాపురం 27 వ తేది, ఉదయగిరి బిట్-3 (ఈనెల 31 వ తేది) అన్ని సచివాలయాల వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర వ్హహించడం జరుగుతుందని తెలిపారు .ఈకార్యక్రమంలో గ్రామ సచివాలయ కార్యదర్శులు,వైద్య సిబ్బం ది,వాలింటరీలు,పూర్తి అవగాహన కలిగి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆమె కోరారు.

## పొదుపు చేయడం ద్వారానే ప్రతి మహిళా ఆర్థిక ప్రగతి సాదిస్తుంది




కలిగిరి, అక్టోబర్ 3, ప్రభాతవార్త; ప్రతి మహిళా ఆర్దికంగా ఎదగాలన్నా, ఆకుటుంబాన్ని పైకి తీసుకు రావా లన్నా ముందు ఆమహిళ ఆర్దికంగా ఎదగాలని, దానికి పొదుపు చేయడమే సరైన మార్గమని నెల్లూరు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కామాక్షి తెలిపారు.మంగళవారం కలిగిరిమండల సమాఖ్య కార్యాలయంలో జరుగుతున్న గ్రామ సమాఖ్యసభ్యుల శిక్షణకు ప్రాజెక్టు మేనేజర్ ముఖ్య అతిదిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ మాట్లాడుతూఎక్కెడ మహిళలు ఆర్దికంగా ముందుకు పోతారో ఆకుటుంభం అన్నివిదాలా పైకి వస్తుందన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలపైన పూర్తి అవగాహన కలిగి సదరు పథకాల నుండి వచ్చే లబ్దితో జీవనోపాదిలను ఏర్పాటు చేసుకొని వ్యక్తి గతంగా, కుటుంబ పరంగా ముందుండా లన్నారు. మహిళ పొదుపు చేయడంతోపాటు ఆదాయంతో కూడిన వ్యాపారాలు నిర్వహించాల న్నారు.గామ సమాఖ్యలు ద్వారా ప్రభుత్వం అందిస్తున్న తక్కువ వడ్డీతో రుణాలు తీసుకొని అబివృద్ధి చోసుకోవాలన్నా రు. కుటుంభం ఆరోగ్యంగా ఉండాలన్నారు.పిల్లలకు మంచి చదువులు చెప్పించాన్నా ఆర్దిక ప్రగతి తప్పని సర అన్నారు. ప్రస్తుతం జరగబోజే గ్రామ సభల్లోఅత్యదికంగా మహిలలు పాల్గొని గ్రామాల అభివృద్దిలో జిపి డిపితో అనుసందానం చేయాలన్నారు.ఈకార్యక్రమంలో ఎపి మదుసూదన్, కలిగిరి మండల ఎపియం సుజా త,సిసిలు లక్ష్మీనసయ్య,ఎం, మాల్యాద్రి,లలిత,వెంకటేశ్వరు కొండల రావు తదితరులు పాల్గొ న్నారు.మోడల్ మండలంగా కలిగిరి; నెల్లూరు జిల్లాలో 13మండలాలు మోడల్ మండలాలుగా ఎంపిక కాగా అందులో కలిగిరి మండలం ఒకటని ప్రాజెక్టు మేనేజర్ కామాక్షి తెలిపారు మండలంలో 4రోజులపాటు యస్.ఆర్. యల్ యంవారి ఆదేశాల మేరకు మండల సమాక్య విజన్ శిక్షణాతరగతులు నిర్వహించడం జరిగిందన్నారు.

## ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారమే తొలగింపులు



**కోవూరు, అక్టోబర్3 ప్రభాతవార్త** గ్రామాల నుంచి పర్మినెంట్‌గా వెళ్లిన వారు, మృతిచెందిన వారు వారి వారి ఓట్లకు సంబంధించి ఒకటికి రెండు పర్యాయాలు నోటీసులు ఇచ్చిన తర్వాత వారి నుంచి ఎటువంటి సమాధానం రాని పక్షంలో మాత్రమే ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అటువంటి ఓట్లను తొలగించడం జరుగుతుందని కోవూర్‌తహసీల్దార్ పద్మజ,అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో మంగ ళవారం రాజకీయ పార్టీల నాయకులతో ఈ సర్వేకు సంబంధించి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ . పర్మినెంట్‌గా మైగ్రేడ్ అయినవారికి సంబంధించి నోటీసులు రిజిస్టర్ పోస్టు ద్వారా ఇవ్వడం జరుగుతుందన్నారు. అక్కడి నుంచి సమాచారం రాని పక్షంలో మరలా వలంటీర్ ద్వారా నోటీసు ఇచ్చి అప్పటికీ ఎటువంటి రిప్లై రాని పక్షంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం అటువంటి ఓట్లను తొల గించడం జరుగుతుందన్నారు. చేసే ఈ పని అంతా పారదర్శకంగా జరుగుతుందని ఈ సందర్భంగా తెలి యజేశారు. ఈ కార్యక్రమంలో , బీజేపీ, పార్టీలకు చెందిన నాయకులు ఉన్నారు.

## బాబు విడుదల కావాలంటూ అన్నదానం



**నెల్లూరు అక్టోబర్ 3, ప్రభాతవార్త-విద్య** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు విడుదల కావాలంటూ రాష్ట్ర మైనార్టీ ఆర్గనైజేషన్ సెక్రెటరీ నౌషాద్ 48వ డివిజనులో ఉన్న మీరా మొహిద్దీన్ దర్గాలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం దర్గాలో చంద్రబాబు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా నౌషాద్, జాఫర్‌లు మాట్లాడుతూ కావాలనే చంద్రబాబునాయుడుపై జగన్ అక్రమంగా కేసు బనాయించి జైలుకు పంపిచాడని వారు ఆరోపించారు. అనంతరం సుమారు 1500 వందలమంది పేదలకి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ హయాత్‌బాబా, జాఫర్‌మోద్దీన్, పెంచలయ్య, నూర్‌ఖాన్, అలీ, ఉస్మాన్, హరజత్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వదువురులకు కాకర్ల పెండ్లికానుక



**ఉదయగిరి అక్టోబర్ 3 ప్రభాతవార్త** ఉదయ గిరి మండలం దుర్గంపల్లి గ్రామానికి చెందిన బకీర్ వెంకటేశ్వర్లు ఇందిరమ్మ కుమార్తె సు భాషిణి వివాహం సందర్భంగా ఉదయగిరి ని యోజకవర్గం తెలుగుదేశం పార్టీనాయకులు కాకర్ల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కాకర్ల సురేష్ వదువురులకు పెండ్లికానుకగా 10 వేల రూ పాయలు అందజేశారు. కాకర్ల ట్రస్టు ప్రతినిధి జల్సా యాదవ్, నగదును వదువరులకు ఇచ్చి కాకర్ల సురేష్ తరపున నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలో ఎక్కడిక్కడ తనట్రస్టు సభ్యులను నియమించి ఎవ్వరికి అవసరం వచ్చిన ట్రస్టు తరపున చేయూత నందిస్తు పేద ప్రజలకు అండగా నిలుస్తున్న కాకర్ల సురేష్‌కి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో బకీర్ కిరణ్, శివా,వెంకటరత్నం,గ్రామస్తులు పాల్గొన్నారు.

## గుడిపల్లి కాలువను పరిశీలించిన కమీషనర్



**బుచ్చి అక్టోబర్ 3 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరంలోని 4,10,11,12,15 వార్డులలో ప్రవహించే గుడిపల్లికాలువను కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి,కౌన్సిలర్లు రాచూరు సత్యనారాయణ, బెల్లం మల్లారెడ్డితో కలిసి పరిశీలించారు.గుడిపల్లి కాలువలో పూడికలు ఎక్కువ కావడంతో సమస్యను చైర్‌పర్సన్ దృష్టికి తీసుకొని వెళ్ళగా వెంటనే స్పందించిన ఆమె కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డికి తెలియజేయడంతో ఆయన కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. గుడిపల్లి కాలువ పూడికతీతను త్వరలోనే తీస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట మున్సిఫల్ సిబ్బంది ఉన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో మెడల్ సాధించిన శ్రీ చైతన్య విద్యార్థి



**కావలి రూరల్, అక్టోబరు 3 ప్రభాతవార్త** గుంటూరు నాగార్జున యూనివర్శిటీలో రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలలో అండర్ 18 విభాగంలో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించిన కావలి శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థి మీనంగారి నవదీప్ తృతీయ స్థానంలో నిలిచి మెడల్‌ని సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విద్యార్థి మీనంగారి నవదీప్‌ను, ఫిజికల్ డైరెక్టర్ కూరపాటి వెంకటేశ్వర్లను అభినందించారు. ఈ మెడల్ సాధనకు పాఠశాల స్థాయి నుండి కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్ కె.జీవన్‌కుమార్‌ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీకర్ల వెంకయ్య, డైరెక్టర్లు పి.వి.ఎస్.ప్రసాద్, యం.కొండయ్య, కళాశాల గౌరవ సలహాదారులు నందన వనం మధుసూదన్, ప్రిన్సిపాల్ లుకోధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 250వ గంధమహోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



**అనుమసముద్రంపేట, అక్టోబర్3, ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏఎస్‌పేటలోని శ్రీహజరత్ ఖాజా రహమతుల్లా నాయెబేరసూల్ దర్గాలో ఈనెల 11న జరిగే 250వ ఉరుసు గంధమహోత్సవ పోస్టర్‌ను మంగళవారం ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆవిష్కరించారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో ఎమ్మెల్యే నివాసంలో దర్గా ఇఒ మహ్మద్ హుసేన్, ఏఎస్‌పేట సర్పంచ్ , వైసిపి మండల నాయకులు షేక్ జిలానీబాషా, ప్రజా ప్రతినిధులతో ఉరుసు మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏఎస్‌పేటలోని దర్గాలో జరిగే గంధమహోత్సవానికి అనేక రాష్ట్రల నుంచి భక్తులు వస్తుంటారని వారికి ఎలాంటి లోటుపాట్లు ఏలకుండా చూసేందుకు ముందుగానే సమీక్షలు నిర్వహించి ఎవరు ఏపనులు చేయాలో ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతి , నీరు , ట్రాఫిక్, విద్యుత్, పారిశుధ్యం, తదితర అంశాల పట్ల ముందుగానే ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని దీనిపై తామందరం కలసి సమీక్ష నిర్వహించుకుందామని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు.

## కావలిలో 'బాబుతో నేను' పోస్టర్లు చించివేత



**కావలి, అక్టోబరు 3 ప్రభాతవార్త** మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ కావ్య ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత డి.వి.కృష్ణారెడ్డి పేరు మీద కావలి పట్టణంలోని పలు ప్రాంతాలలో 'బాబుతో నేను' అనే పోస్టర్లను అంటించారు. అయితే కావలి మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కు ఎక్కడ నుంచి ఆదేశాలు వచ్చాయో ఏమో కాని మున్సిపల్ పారిశుధ్య కార్మికుల చేత ఈ పోస్టర్లను చించివేయించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ 'తప్పుడు కేసులు ఎన్ని పెట్టినా చివరికి నిజమే గెలుస్తుంది, బాబుతో నేను' అనే పోస్టర్లను మున్సిపల్ సిబ్బంది చించివేయించడం తీవ్ర చర్చనీయాంశమైంది. గతంలో కూడా తెలుగుదేశం పార్టీకి చెందిన ఫ్లెక్సీలను మున్సిపల్ కమిషనర్ కిరణ్ తొలగించడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. మరలా మున్సిపల్ కమిషనర్ కిరణ్ తెలుగుదేశం పార్టీకి సంబంధించి పోస్టర్లను సిబ్బంది చేత చించివేయించడం పట్ల ఆ పార్టీ శ్రేణులు మండిపడుతున్నారు.అధికార పక్షానికి సంబంధించి ఫ్లెక్సీలు, పోస్టర్లు వుంచి ప్రతిపక్షాలకు సంబంధించిన వాటిని మాత్రమే తొలగిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవు తున్నాయి. కావలి పట్టణంలో ఫ్లెక్సీలు కానీ పోస్టర్లు కానీ తొలగించడం అన్ని పార్టీలకు వర్తిస్తుందో లేదో వేచిచూడాలి.

## ఆముదాలదిన్నె గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష



**కావలి రూరల్, అక్టోబరు 3 ప్రభాతవార్త** కావలి రూరల్ మండలం ఆముదాలదిన్నె గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి సతీమణి ఆదిలక్ష్మి పాల్గొన్నారు. ఆముదాలదిన్నె, మన్నంగిదిన్నె గ్రామ పంచాయతీ ప్రజల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకొని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి కోరారు అనంతరం ఆమె చేతుల మీదుగా బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో ఎ.వి.కృష్ణమోహన్, ఎయంసి చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యులు జంపాని రాఘవులు, ఆముదాలదిన్నె సర్పంచ్ బ్రహ్మానందం, మన్నంగిదిన్నె సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, కావలి మండల జెసిఎస్ కన్వీనర్ నాగన్నగారి శ్రీనివాసులు, ఎపియం కాంతారావు, ఎఎన్‌యంలు, ఆశా వర్కర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా చిత్తలూరులో మాతమ్మకు పొంగళ్ళు



**చేజర్ల, అక్టోబర్3, ప్రభాతవార్త:** మండలంలోని చిత్తలూరు గ్రామంలో వెలిసయున్న మాతమ్మ అమ్మవారికి ఆ గ్రామానికి చెందిన మహిళలు మంగళవారం పొంగళ్ళు పొంగించి నైవేద్యం అమ్మవారికి పెట్టారు. ఈసందర్భంగా గ్రామంలో పాడి పంటలు బాగా వర్ధిల్లాలని అలాగే ఏడాది వర్షాలు బాగా పడాలని మహిళలు అమ్మవారిని మొక్కుకున్నారు. ప్రసాదాలను గ్రామస్తులకు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## అక్రమ నిర్బంధం నుండి చంద్రబాబు ఎప్పుడు వస్తారా అని ఎదురుచూస్తున్నారు



**కావలి, అక్టోబరు 3 ప్రభాతవార్త** అక్రమ నిర్బంధం నుండి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎప్పుడెప్పుడు బయటకు వస్తారా అని ప్రజలు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారని తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌ని నిరసిస్తూ మాలేపాటి ఆధ్వర్యంలో కావలి టిడిపి కార్యాలయంలో నిర్వహిస్తున్న రిలేనిరాహారదీక్షలు మంగళవారం నాటికి 20వ రోజుకు చేరుకున్నాయి. టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా మాలేపాటి సుబ్బానాయుడు మాట్లాడారు. చంద్రబాబునాయుడుని అరెస్ట్ చేసి 25 రోజులైందన్నారు. సియం జగన్మోహన్‌రెడ్డి జైలులో వున్నాడని చంద్రబాబునాయుడుని కూడా ఏదో ఒక విధంగా జైలులో పెట్టాలన్న కక్ష సాధింపుతో మాత్రం జగన్ సైకో ఇజాన్ని చూపాడని దుయ్యబట్టారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా చంద్రబాబునాయుడు కడిగిన ముత్యంలా బయటకు వచ్చి ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. రానున్న రోజుల్లో నారా లోకేష్, అచ్చయ్యనాయుడు, పొంగూరు నారాయణలను అరెస్ట్ చేయాలని చూస్తున్నారన్నారు. ఎంతమందిని అక్రమంగా అరెస్ట్ చేసినా మా టిడిపి నాయకులు, కార్యకర్తలు భయపడరని హెచ్చరించారు. అన్నింటికి సిద్దంగా వున్నామన్నారు. సియం జగన్మోహన్‌రెడ్డి, వైసిపి మంత్రులు ఎంతో మంది జైలు జీవితం అనుభవించారన్నారు. జగన్ వల్ల ఐఎఎస్ అధికారులు కూడా జైలుకు వెళ్లారని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వం అంటేనే ఒక దగా, దోపిడీ ప్రభుత్వమని విమర్శించారు. ప్రజలు ఒక్కసారి అని నిన్ను గెలిపించారని తెలిపారు. ప్రజలు తప్పు తెలుసుకున్నారని ఇక జీవితంలో జగన్మోహన్‌రెడ్డిని నమ్మరన్నారు. తల్లిని, చెల్లిని ఆదరించలేని సియం జగన్మోహన్‌రెడ్డి ఈ రాష్ట్ర ప్రజలను ఏ విధంగా ఆదరిస్తాడో ఇప్పుడు అర్ధమైందన్నారు. రాష్ట్రానికి జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఏదైనా ఒక మంచి పనిచేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన చేసిందంతా టిడిపి నాయకులపై అక్రమ కేసుల పెట్టడమేనని ఎద్దేవ చేశారు. భయపెడితే భయపడే రోజులు పోయాయని తిరగబడి నీకు మోత మోగించే రోజులు దగ్గరలోనే వున్నాయని హెచ్చరికలు చేశారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తన లిక్కర్ కేసులకు ఎన్నిసార్లు మా నాయకుల వద్ద తిరిగావో మాకు తెలియదా అన్నారు. నారా చంద్రబాబు నాయుడుని, నారా లోకేష్‌ని విమర్శించే స్థాయి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డికి లేదన్నారు. పెద్ద సైకో సియం జగన్ అని, చిన్న సైకో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే కావలిని కనకపట్నం చేస్తానంటున్నారని ఆయన బతుకుకు తుమ్మలపెంట రోడ్డు వేస్తే చాలు అన్నారు. నువ్వు ఎమ్మెల్యే అని చెప్పుకోవడానికే సిగ్గుగా వుందన్నారు. నువ్వు అంత పోటు గాడివి అయితే కావలిలో నిలిచిపోయిన పనులు పూర్తి చేయాలని సవాల్ విసిరారు.ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ల్యాండ్, ఇసుక, గ్రావెల్ మాఫియాలు వెలికితీసి సరైన గుణపాఠం చెబుతామని హెచ్చరికలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ పరిశీలకులు బొమ్మి సురేంద్ర, టిడిపి నాయకులు మన్నవ రవిచంద్ర, జ్యోతిబాబురావు, గుత్తికొండ కిషోర్‌బాబు, గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, మంచాల ప్రసాద్, షేక్ మస్తాన్, శానం హరి, గుర్రం సునీల్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమరజీవి జీవితగాథ అందరికి ఆదర్శప్రాయం



**నెల్లూరు, అక్టోబరు3 ప్రభాతవార్త-విద్య** ఒకే బాషమాట్లాడే వారందరూ ఒకే రాష్ట్రంలోఉండాలని ఆకాంక్షిస్తూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితగాథ భావి తరాలకు ఆదర్శప్రాయమని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని స్థానిక డికె ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు పోరాట జీవితకథ పస్తక పరిచయ సబను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గాంధీగిరి సిద్ధాంతాలకు ప్రేరేపితులై, అనేక పోరాటాల్లో పల్గొన్ని నూతనరాష్ట్రం ఏర్పాటుకు చేసేందుకు ప్రాణాలుసైతం విడనాడిన పొట్టిశ్రీరాములు స్థారకస్తూపాన్ని నగరంలో ఏర్పాటుచేయ్యాలని కోరారు. ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి, డికె జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డ్టాకర్ ఆదూరు శ్రీనివాసులు మాట్లాడుతు తమ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ రచించిన పుస్తక పరిచయ సబ నేడు తమ కళాశాలలో నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. ఇటువంటి పుస్తకాలు మరిన్ని వచ్చినపుపడే మహనీయుల జీవిత చరిత్ర భావి తరగాలకు స్పష్టంగా తెలుస్తుందన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి వై.వెంకటయ్య మాట్లాడుతు పొట్టిశ్రీరాములు జీవిత గాధను వివరించారు. అనంతరం పొట్టి శ్రీరాములు జీవిథగాద పుస్తకాన్ని ఆవిష్కరించి అందరికి అందజేశారు.ఈ కార్యక్రమంలో కె.కరుణశ్రీ, డికె.డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గిరి, జి.మాల్యాద్రి, రంగారావు, వెంకటేశ్వర్లు, రవీంద్రనాద్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం జగన్‌ను కలిసిన డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్



**నెల్లూరు సిటీ, అక్టోబరు 3, ప్రభాతవార్త** నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్‌ను రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆప్యాయంగా పలకరిం చా రు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభా కర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరులతో కలిసి రూప్‌కుమార్ యాదవ్ ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. వైసీపీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టప డి పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

## నుడా చైర్మన్‌గా సన్నపురెడ్డి పెంచలరెడ్డి..?



**నెల్లూరు సిటీ, అక్టోబరు 3, ప్రభాతవార్త** నెల్లూరు నుడా చైర్మన్‌గా వైసీపీ సీనియర్ నేత, ప్రముఖ వ్యా పారవేత్త సన్నపురెడ్డి పెం చలరెడ్డిని నియమించే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. నెల్లూరు సిటీ ఎమ్మె ల్యే, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌కి అత్యంత సన్నిహితంగా ఉంటూ 2019 లో అనిల్‌కుమార్ గెలుపుకు కృషి చేసిన మాజీ డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ 2021 సెప్టెంబరులో నుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిం చారు. తదనంతరం జరిగిన పరిణామాల కారణంగా ఎమ్మెల్యే అనిల్‌కు ముక్కాల ద్వారకానాథ్‌కు మధ్య విభేధాల కారణంగా దూరం పెరుగుతూ వచ్చింది. నుడా చైర్మన్‌గా ఉన్నప్పటికి ద్వారకానాథ్ బాధ్యతలకు దూరంగానే ఉన్నారు. ఈ క్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త వైసీపీ సీనియర్ నేత సన్నపురెడ్డి పెంచలరెడ్డి పేరు తెరపైకి వచ్చింది. ఇటు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ అదే విధంగా ఎంపీలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరుల మద్దతుతో నుడా చైర్మన్ పదవి సన్నపురెడ్డికే దక్కే అవకాశం ఉందని విరివిగా ప్రచారం జరుగుతుంది. మంగళవారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నగర మేయర్ స్రవంతి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ తదితరులతో పాటు సన్నపురెడ్డి పెంచలరెడ్డి కూడా ముఖ్యమంత్రిని కలవడం జరిగింది. నుడా చైర్మన్ పదవి కాలం 2023 సెప్టెంబరుతో ముగియడంతో నూతన నుడా చైర్మన్ పదవి ఖాళీ అయింది.

## డిబియస్ కళాశాలలో సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణా తరగతులు



**కావలి రూరల్, అక్టోబరు 3 ప్రభాతవార్త** కావలి మద్దూరుపాడులోని డిబియస్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ అకాడమి, నంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ఫైనలి యర్ విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు ప్రారంభించి మాట్లాడారు. మహేంద్ర గ్రూపుకు చెందిన నంది ఫౌం డేషన్ మా కళాశాలలో ఫైనలియర్ విద్యార్థులకు ప్లేస్‌మెంట్‌కు కావాల్సిన శిక్షణా తరగతులు నిర్వహించడం ఎంతో ఉపయోగకరమన్నారు. విద్యార్థులు దీనిని ఉపయోగించుకుని ఉద్యోగాలు సంపాదించుకోవచ్చని తెలిపారు. నంది ఫౌండేషన్‌కు చెందిన పవన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు కావాల్సిన అన్ని రకాల శిక్షణా తరగతులు మా ఫౌండేషన్ ద్వారా ఇప్పించగలమని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వి.రావు మాట్లాడుతూ విద్యార్థులకు కావాల్సిన అన్ని రకాల శిక్షణ, ప్లేస్‌మెంట్‌లకు సంబంధించి కళాశాల తగు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో జి.రమేష్‌బాబు, ఇసిఇ హెచ్‌వోడి వేణుగోపాల్, శ్యామ్‌సుందర్, ఫైనలియర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## నేతలు, కార్యకర్తలతో ఎమ్మెల్యే అనిల్ సమావేశం




**నెల్లూరు సిటీ, అక్టోబరు 3, ప్రభాతవార్త** నెల్లూరు నగరంలోని నవాబుపేట షాదీమంజిల్‌లో 9,10,11వ డివిజన్లకు సంబంధించిన వైసీపీ నాయకులు, కార్యకర్తలతో నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నగర నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిస్థితిని వివరించారు. నగర నియోజకవర్గంలో తాము చేసిన శాశ్వత అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని తెలిపారు. 2024 మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకునే విధంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కిన్నెర ప్రేమ్‌కుమార్, గోతం అరుణ, 9వ డివిజన్ ఇన్‌ఛార్జి వంగాల శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



**ఆత్మకూరు, అక్టోబర్3, ప్రభాతవార్త:** ఆత్మకూరు రూరల్ మండలంలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి కోరారు. ఆత్మకూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి మంజూరుచేయించిన అభివృద్ధిపనులను అధికారుల పర్యవేక్షణలో గ్రామస్థాయి నాయకులు, ప్రజా ప్రతినిధులు త్వరగా పూర్తిచేయాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం పథకంలో భాగంగా మంజూరైన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలో అమలవుతున్న పథకాలు భారతదేశానికే ఆదర్శంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి పలు రకాల పథకాల ద్వారా లబ్ధిచేకూరిందన్నారు. అనంతరం అజెండాలో పేర్కొన్న అంశాలపై శాఖల వారీగా తమ ప్రగతి నివేదికలను సభ ముందుంచారు. ఈసమావేశంలో ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్‌కుమార్, వ్యవసాయాధికారి శ్రీనివాసరావ్, జడ్పీటిసి సభ్యులు టి.ప్రసన్నలక్ష్మి, మండల ఉపాధ్యక్షురాలు కంభంశెట్టి ప్రమీల, మండల ఉపాధ్యక్షుడు ఉద్దాల పెంచలరావ్ , అధికారులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యానికి భరోసా



**దుత్తలూరు(వరికుంటపాడు), అక్టోబర్ 3, ప్రభాతవార్త** : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందనీ దుత్తలూరు మండల పరిషత్ అధ్యక్షుడు చేజర్ల జయంత్ రెడ్డి అన్నారు.జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక క్యాంపును ఏరుకొల్లు సచివాలయ పరిధిలో ఎంపీపీ చేజర్ల జయంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 రోజుల వ్యవధిలో 5 వేల మందికి పైగా వైద్యాధికారులతో,1.67 కోట్ల కుటుంబాలకు ఉచిత వైద్య సేవలను అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు.వైకాపా ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఎన్నో పథకాల అందిసద్తుందనీ కొనియాడారు.ఈ కార్యక్రమములో ఎంపిడిఓ సాయి ప్రసాద్,తహశీల్దార్ చొప్పా రవీంద్రబాబు, బ్రహ్మేశ్వరం గ్రామ సర్పంచ్ మీసాల సుబ్బారాయుడు యాదవ్,మండల వైసిపి కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి,జిల్లా సెంట్రల్ బ్యాంకు చైర్మన్ చేజర్ల చలమారెడ్డి ,సొసైటి చైర్మన్ మండవ శివ,జెసిఎస్ కన్వీనర్ ఎ.వెంగళ్‌రెడ్డి,పంచాయతీ కార్యదర్శులు నాగ రాజు,హరి కృష్ణ,నేతలు వెంకటేశ్వర్లురెడ్డి,రమణారెడ్డి,వెంకట్‌రెడ్డి,కరాది వెంకటేశ్వర్లు రెడ్డి,చేజర్ల బ్రహ్మారెడ్డి,నాగ చంద్రారెడ్డి,మట్ల మమత తదితరులు పాల్గొన్నారు.

## నాగులవెలటూరులో గ్రామసభ బహిష్కరణ

**చేజర్ల, అక్టోబర్3, ప్రభాతవార్త:** మండలంలోని నాగులవెలటూరు గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం జరగాల్సిన గ్రామసభను బహిష్కరించారు. గ్రామస్తులకు, గ్రామ సర్పంచ్‌కు సరైన సమాచారం ఇవ్వకపోవడం వలన గ్రామసభను బహిష్కరించినట్లు ఆ గ్రామ సర్పంచ్ మస్తాన్ పేర్కొన్నారు. ఈసందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు వేలూరు కేశవచౌదరి మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే గ్రామసభలు గ్రామ సర్పంచ్‌కు తెలియజేయకుండా గ్రామసభలు ఎలా పెడతారని అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీ గ్రామసభ నిర్వహించాలంటే ప్రజలందరికీ తెలియజేసి పారదర్శకంగా గ్రామసభ నిర్వహించాలని కోరారు. అంతేకాకుండా సంబంధిత అధికారులు కూడా హాజరు కాకపోవడంపై పలువురు అభ్యంతరం తెలిపారు. గ్రామసభకు ఉన్నతాధికారులతోపాటు ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ ఈ విషయమై అధికారులు ప్రచారం చేయకపోవడం సరికాదన్నారు. గ్రామసభల్లో గతంలో ఇచ్చిన అర్జీలు ఆమోదించిన తీర్మానాలు అమలు జరపకపోవడంతో భూ సమస్య అధికశాతం ఉండడం వలన పరిష్కార మార్గం చూపలేదని గ్రామస్తులు వచ్చిన గ్రామరెవెన్యూ అధికారిని నిలదీసి ఆవేదన వ్యక్తం చేశారు. ఈగ్రామసభ గురువారం ఉదయం 10గంటలకు యధావిధిగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

## మన ఊరు మనమే శుభ్రం చేసుకుందాం



**బుచ్చి అక్టోబర్ 4ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాలెంలోని శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్ విద్యార్థులు,ఉపాధ్యాయులు స్వచ్ఛతహిసేవ కార్యక్రమంలో భాగంగా మన ఊరు మనమే శుభ్రం చేసుకుందాం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల పరిసరాలలోని కోనేటిమిట్ట ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలను చెత్త చెదారాలను ముళ్ల చెట్లను తొలగించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నేలనూతల శ్రీదర్ మాట్లాడుతు మన ఊరు మనమే బాగు చేసుకోవాలని తద్వారా గ్రామ ం ఎంతో ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు.మనదేశం ఆరోగ్య బారత్‌గా ఉండాలంటే భారతప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరు గ్రామాన్ని బాగు చేసుకునేందుకు కొంత సమయాన్ని కేటాయించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అమీర్, కుమార్,సురేఖ, గిరిజ,ఆమని, అనిత,విజయలక్ష్మీ విద్యార్థులు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం

**అల్లూరు, అక్టోబరు 3 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం అల్లూరు ప్రభుత్వాసుపత్రి నందు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా వైసిపి నగర కన్వీనర్ దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్‌లు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల వైద్యులు పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించారు. బిపి,షుగర్ లెవల్స్ అక్కడే చెక్‌చేసి ఉచితంగా మందులు అందజేశారు. అల్లూరు మండలం, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ ఫణికుమార్, పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఇస్కపల్లి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ పాండురంగనాథ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## తుమ్మలపెంట రెసిడెన్షియల్ పాఠశాలలో గెస్ట్ ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు చేసుకోండి

**కావలి రూరల్, అక్టోబరు 3 ప్రభాతవార్త** కావలి రూరల్ మండలం తుమ్మలపెంటలోని ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో గెస్ట్ ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఈ పాఠశాల ప్రిన్సిపాల్ కె.పద్మావతి తెలిపారు. బాలికలకు ఇంగ్లీషు మీడియంలో బోధించేందుకు పిజిటి ఫిజికల్ సైన్స్, టిజిటి ఇంగ్లీషు, టిజిటి సోషల్ స్టడీస్, టిజిటి హిందీ సబ్జెక్టులకు మహిళా ఉపాధ్యాయ సిబ్బంది కావాల్సి వుందని తెలిపారు. ఈ సబ్జెక్టులకు పోస్ట్ గ్రాడ్యుయేషన్, గ్రాడ్యుయేషన్ బిఇడి, టెట్ అభ్యర్థులు అర్హులని (2018 డిఎస్సీ గైడ్‌లైన్స్) తెలిపారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈ నెల 8వ తేది లోపు తమ వివరాలతో కూడిన అప్లికేషన్ ఫారం, అర్హతలు గల జెరాక్స్ ప్రతులను పాఠశాలలో సమర్పించాలని ఆమె కోరారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో కమిటీ ద్వారా డెమో తరగతులు తీసుకొని ఎంపిక చేస్తారని ప్రిన్సిపాల్ కె.పద్మావతి తెలిపారు.